క్లుప్తంగా

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం



ఈదరాడలో చెత్త సేకరణను పర్యవేక్షిస్తున్న కార్యదర్శి రాజు

మామిడికుదురు: ఈదరాడలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం జరిగింది. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు సూచించారు. ప్రజల సహకారంతోనే సంపూర్ణ పారిశుధ్యం సాధ్యమవుతుందన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా సిబ్బంది సూచించిన ప్రాంతాల్లోనే చెత్త వేయాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నామని కార్యదర్శి రాజు తెలిపారు. సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

విద్యామిత్ర కిట్ల నాణ్యత పరిశీలన



లూటుకుర్రులో విద్యామిత్ర కిట్ల నాణ్యతను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ వేణుగోపాల్

మామిడికుదురు: లూటుకుర్రు జెడ్పీహెచ్ స్కూల్లో ఏర్పాటు చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల నాణ్యతను డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి జె.వేణుగోపాల్ మంగళవారం పరిశీలించారు. మండలంలో ఈ స్టాక్ పాయింట్ నుంచే అన్ని స్కూళ్లకు కిట్లను సరఫరా చేస్తున్నారు. కిట్ల నాణ్యతను డీఎల్‌డీఓ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థికి కిట్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు. మగటపల్లి జెడ్పీ హెచ్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. హెచ్ఎం కె.రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి విద్యార్థులకు కిట్లను అందజేశారు.

వెంకన్న సన్నిధిలో జడ్జి రమణారెడ్డి



జడ్జి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

కొత్తపేట: అమలాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ పి.రమణారెడ్డి సతీసమేతంగా ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. జడ్జి మంగళవారం ఆలయానికి రాగా ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం సిబ్బంది, అర్చకులు స్వాగతం పలికి స్వామి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. జడ్జి దంపతులు స్వామివారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలతో స్వామివారి చిత్రపటం అందజేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేస్తున్న హెచ్ఎం గణేశ్వరరావు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి అంబటి మురళీమోహన్ అందించిన ఆర్థిక సాయంతో మంగళవారం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు చేతుల మీదుగా ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలతో పాటు పెన్ను, స్కేలు, పెన్సిల్ అందజేశారు. అంబటి మురళీమోహన్ దాతృత్వాన్ని, సేవాతత్పరతను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేరేడుమిల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు వై.ఫణికుమార్, ఎ.శ్రీనివాసరావు, జి.సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూదరులపై పోలీసుల దాడి

సఖినేటిపల్లి: గ్రామంలోని ఓ రైతు కొబ్బరి తోటలో పేకాడుతున్న వారిపై స్థానిక పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడి చేశారు. దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి నగదు రూ.4,500 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు తెలిపారు. కాగా వారికి స్టేషన్ కండిషన్ బెయిల్ మంజూరు చేసి, విడుదల చేసినట్టు ఎస్సై అన్నారు.

ప్రయాణం.. జారితే ప్రమాదం

- రోడ్లపై పేరుకున్న బురద
- అడుగడుగునా గోతులే..
- ప్రమాదకరంగా ఆర్అండ్‌బీ రోడ్లు



గత ప్రభుత్వం నిధులిచ్చినా నేటికీ పనులు జరగని చింతలపల్లి- లక్కవరం రోడ్డు



ప్రమాదకరంగా శంకరగుప్తం రోడ్డు

మలికిపురం: రాజోలు దీవిలో రోడ్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. మొన్నటి వరకూ వేసవి కావడంతో దూర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, టిప్పర్లపై మట్టి, గ్రావెల్, రేగడి వంటి వాటిని రోడ్లపై తరలించారు. వాటి నుంచి రోడ్డుపై పడిన మట్టి ప్రస్తుత వర్షాలకు బురదగా మారి అత్యంత ప్రమాదకరంగా మారాయి. అసలే అధ్వానంగా ఉన్న రోడ్లపై ఈ బంక వల్ల పుండుపై కారం చల్లినట్లు మారింది. రాజోలు దీవితో పాటు పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో కూడా ఈ సమస్య తీవ్రంగా ఉంది. అసలే ఆర్అండ్‌బీ రోడ్లు పునర్నిర్మాణానికి నోచుకోక అనేక గ్రామాల్లో గుంతలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ప్రస్తుత వర్షాలు తోడు కావడంతో ప్రజల రాకపోకలు అత్యంత దుర్భరంతో పాటు ప్రమాదకరంగా మారాయి. రేగడి పడడంతో బురదగా మారి వాహనాలు జారిపోతున్నాయి. బస్సులు దిగబడుతున్నాయి. నియోజకవర్గంలో ప్రధాన రహదారుల మాట గాలికి వదిలేశారు. పోనీ ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేసిన రోడ్లేమైనా బలంగా వేశారా అంటే అదీ లేదు. గోతుల పూడ్చి తారు వేశారు. ప్రస్తుత వర్షాకాలంలో వీటి బండారం బయట పడుతోంది. నియోజకవర్గంలో ప్రధాన రహదారుల్లో ఒకటైన చింతలపల్లి వయా లక్కవరం, విశ్వేశ్వరాయపురం మలికిపురం రోడ్డు పూర్తిగా పాడయిపోయింది. గత ఎన్నికల నాటికే గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సుమారు ఐదు నెలల క్రితం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఈ రోడ్డు ప్రారంభించారు. వెడల్పు చేసేందుకు రోడ్డు సైడ్ బెర్మ్‌లు తవ్వి వదిలేశారు. సుమారు రూ.2.50 కోట్లతో ఈ పనులు ప్రారంభించి అర్ధాంతరంగా వదిలేశారు. దీంతో అసలుకే ఎసరు వచ్చి ప్రయాణం మరింత జటిలమైంది. మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు బస్సులు తిరిగే ప్రధాన రవాణా మార్గం ఇదే.. దీంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఇక అంతర్వేది పుణ్య క్షేత్రం నుంచి దండు పుంత మీదుగా వయ్యూరి వారి మెరక, కత్తిమండ, చింతలపల్లి మీదుగా బి.సావరం, సోంపల్లి వరకూ గల 34 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. నియోజకవర్గంలో పెరిగిన రవాణా అవసరాల నేపథ్యంలో సుమారు పది గ్రామాల్లో విస్తరించి ఉన్న రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. కానీ అభివృద్ధి లేదు. ఇక సముద్రతీర ప్రాంతంలో వాణిజ్య అవసరాలతో పాటు ప్రజల దైనందిన కార్యక్రమాల రాకపోకలకు అత్యంత ప్రాధాన్యం కలిగిన శంకరగుప్తం పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం సముద్ర తీర ప్రాంత రోడ్డు పూర్తిగా పాడయి పోయింది. ఇది పూర్తిగా పునర్నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. సఖినేటిపల్లి మండలంలో శృంగవరప్పాడు, ఉయ్యూరి వారి మెరక ఆర్అండ్‌బీ రోడ్డు కూడా ధ్వంసమైంది. ఇలా నియోజక వర్గంలో సుమారు 100 కిలోమీటర్ల ప్రధాన రోడ్లు మిక్కిలి అధ్వానంగా ఉన్నాయని అధికారులు అంచనాలు వేశారు.



విశ్వేశ్వరాయపురం-మలికిపురం అధ్వాన రోడ్డుపై గ్రామస్తుడి నిరసన

ప్రమాదాల బారిన పడుతున్నాం



నియోజకవర్గంలో రోడ్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. గోతులు పడి బురదతో ఉన్నాయి. ప్రజలు జారి పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు.

– పెయ్యల చిట్టిబాబు, వార్డు మెంబర్, విశ్వేశ్వరాయపురం

జూలైలో మొదలు పెడతాం



నియోజకవర్గంలో ప్రధాన రోడ్డు అయిన చింతలపల్లి, లక్కవరం, మలికిపురంలో రోడ్డు పనులు జూలై నెలలో ప్రారంభిస్తాం, నిధులు ఉన్నాయి. సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడాం. మిగిలిన రోడ్లకు ప్రతిపాదనలు ఉన్నాయి. పనులు పూర్తి చేయిస్తాం.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

జగ్గిరెడ్డిని కలసిన కిషోర్



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డిని కలసిన తెన్నేటి కిషోర్ తదితరులు

రావులపాలెం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న తీరును వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో ఉత్సాహంగా ఉండాలని పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని ఆయన మంగళవారం గోపాలపురంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయప మాట్లాడుతూ 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఇందులో భాగంగా బుధవారం అమలాపురం ఏ–1 కన్వెన్షన్ హాల్లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట ముప్పటి రాజేష్ ఆకుమర్తి రమేష్ తదితరులు ఉన్నారు.

ఇసుక ర్యాంపు పరిశీలన

ఆలమూరు: మండలంలోని జొన్నాడ ఇసుక ర్యాంపును మండల స్థాయి ఇసుక టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీఓ ఎ.రాజు నేతృత్వంలో డీటీ టి.సుబ్బరాజు, ఆర్ఐ ఎం.రావాయమ్మ, గ్రామ పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులు తవ్వకాలు జరుపుతున్న ప్రదేశాన్ని, నిల్వ చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక తవ్వకాలను పరిశీలించామని టాస్క్‌ఫోర్స్ బృందం తెలిపింది.

వైద్యులకు సన్మానం



మలికిపురంలో వైద్యులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు



నగరం పీహెచ్‌సీలో డాక్టర్ లెవీని సన్మానించిన ఉద్యోగులు

మలికిపురం: అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం మలికిపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులను ఘనంగా సన్మానించారు. మలికిపురం రోటరీ క్లబ్ అధ్యక్షుడు గద్దం ఫిలిప్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులైన రోటేరియన్ రవి స్కానింగ్ అధినేత డాక్టర్ ఎస్.రవి, విజయ హాస్పిటల్ అధినేత డాక్టర్ రాపాక రమేష్ బాబు, డాక్టర్ ఓగూరి అలేఖ్య, డాక్టర్ నింషి, డాక్టర్ సిసిలి, డెంటిస్ట్ జి.వరుణ్ నారాయణ, డాక్టర్ బత్తుల ప్రజ్వల్, సుబ్బమ్మ హాస్పిటల్ డాక్టర్ లతా పాల్, మొదలైన డాక్టర్లను సన్మానించి వారి సేవలను అభినందించారు. పేషెంట్ కష్టకాలంలో ఏ పరిస్థితుల్లో ఉన్న డాక్టర్లు రోగికి తన సేవలు అందించడంలో గొప్ప దేవుడిగా భావిస్తారని ఫిలిప్‌రాజు అన్నారు. వైద్య వృత్తి అమోఘమైనదని ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు గుబ్బల బాబ్జి, గెడ్డం తులసీభాస్కరరావు, నల్లి శివకుమార్, కేవీవీ ప్రసాద్ పాల్గొని వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మామిడికుదురు: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నగరం పీహెచ్‌సీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి జాన్ లెవీని ఘనంగా సత్కరించారు. డాక్టర్లు సమాజ సేవకులని సీహెచ్ఓ కేఎస్ సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్ బి.నరసింహారావు పేర్కొన్నారు. ఆపదలో ఉన్న ఎంతో మందికి ప్రాణభిక్ష పెట్టే మహానుభావులని కీర్తించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్ఓలు, ఎంపీహెచ్ మేల్ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలమూరు: స్థానిక సీహెచ్‌సీతో పాటు, చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులకు స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్‌లను కట్ చేశారు. సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఆర్.బాలామణి ఎల్‌టీ పి.రాజారమేష్ కుమార్, ఫార్మసిస్టు డి.సుగుణలక్ష్మి పాల్గొన్నారు.

నేటి వైఎస్సార్ సీపీ సమావేశానికి తరలిరండి



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు డేవిడ్‌రాజు

కొత్తపేట: జిల్లా కేంద్రం అమలాపురంలో జరగనున్న జిల్లా వైఎస్సార్ సీపీ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తల తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డితో పాటు నియోజకవర్గ నాయకులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఆ మేరకు జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు డేవిడ్‌రాజు మంగళవారం కొత్తపేటలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' పేరుతో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అమలాపురం మండలం ఇందుపల్లి ఎ-కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశానికి పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివెళ్లనున్నట్టు తెలిపారు. ఇంతవరకూ లేనిది ఇప్పుడు జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేయడంలో ఆంతర్యమేంటోనని డేవిడ్‌రాజు అన్నారు. రాష్ట్రంలో పాలకులు, పోలీసులు తీరు గమనిస్తుంటే ఒక పథకం ప్రకారం ప్రతిపక్ష వైఎస్సార్ సీపీని నిలువరించే విధంగా ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్ రెడ్డి చంటి, పీఏసీఎస్ మాజీ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సేవాదల్ అధ్యక్షుడు జీపీ తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడులు చేసే వారిని శిక్షించాలి



అంబాజీపేటలో సీఐకు వినతిపత్రం ఇస్తున్న మీడియా ప్రతినిధులు

అంబాజీపేట: మీడియా స్వేచ్ఛను గౌరవించకుండా భంగం కలిగించేవారిపైనా, దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించాలని ది అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్ట్ అంబాజీపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పళ్ల సూర్యప్రకాశరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి పిల్లి శేఖర్‌లు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ పి.గన్నవరం నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ప్రెస్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మహా న్యూస్ రిపోర్టర్ సీహెచ్ నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ మీడియా చానల్, పత్రికా కార్యాలయాలపై జరిగిన దాడులను ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు చోటు లేదని అభిప్రాయపడ్డారు. బెదిరింపులు, దాడులతో మీడియాను కట్టడి చేయాలనే ఆలోచన మంచిది కాదని, ప్రజలు, సమాజం దీన్ని ఆమోదించరని స్పష్టం చేశారు. మీడియాపై దాడులు అంటే ప్రజాస్వామ్యంపై దాడి, వ్యవస్థలో బలహీన రాజకీయాలకే ఇది నిదర్శనమన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై కె.చిరంజీవికు అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ మూర్తి, జుత్తుక రాంప్రసాద్, గుత్తుల ఏడుకొండలు, జల్లి విక్టర్‌కుమార్, మద్దింశెట్టి శ్రీనివాసరావు, గుత్తుల ఏడుకొండలు, కోన సత్తిబాబు, జల్లి విక్టర్‌కుమార్, చైతన్య, ఏడుకొండలు, మట్టపర్తి రాము పాల్గొన్నారు.

సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

కొత్తపేట: స్థానిక సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 1 నుంచి 31 వరకూ సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నట్టు స్థానిక డీఎస్పీ సుంకర మురళీమోహన్ తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తపేట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, నగరం, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి ప్రాంతాలకు ఇది వర్తిస్తుందని డీఎస్పీ పేర్కొన్నారు. దీని ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదని, అటువంటివి జరపడానికి కొత్తపేట ఎస్‌డీపీఓ వద్ద ముందుగా అనుమతి పొందవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అందరూ గమనించి, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పచ్చిరొట్టను సేంద్రియ ఎరువుగా మార్చండి

మలికిపురం: పచ్చిరొట్టను సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని ప్రకృతి వ్యవసాయ మలికిపురం యూనిట్ ఇన్‌చార్జ్ కిరణ్ రైతులకు సూచించారు. మలికిపురం మండలం లక్కవరంలో గుబ్బల సత్యనారాయణ పొలంలో సాగు చేసిన క్షేత్రంలో ఎకరానికి 5,294 కేజీల పచ్చిరొట్ట ఎరువు వచ్చింది. ఇక్కడ ఏర్పాటు చేసిన రైతుల శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వేసవిలో భూమిని ఖాళీగా వదిలేయకుండా నవధాన్యాల సాగు చేపట్టడం ద్వారా ఏర్పడిన పచ్చిరొట్ట ఎరువు ద్వారా భూముల్లో సేంద్రియ కర్బనం ఏర్పడుతుందని అన్నారు. దీంతో భూమిని కప్పి ఉంచటం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని అలాగే భూసారం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు స్వర్ణకుమారి, హరిబాబు, సూర్యకుమారి, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

డెంగీ మాసోత్సవాలను విజయవంతం చేయాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి డెంగీ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలని చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీ స్నేహలక్ష్మి, బి.అనంత రామకృష్ణ అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో పాటు ఆయుష్మాన్ మందిర్‌లో మంగళవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి 31 వరకూ నిర్వహించే డెంగీ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాల ఆవశ్యకతను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

కృషీవల కంపెనీకి రాయితీపై డ్రోన్ పంపిణీ



అంబాజీపేటలో కృషీవల కంపెనీ ప్రతినిధులకు డ్రోన్‌ను అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

అంబాజీపేట: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 80 శాతం రాయితీపై స్థానిక కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీకి ప్రభుత్వం డ్రోన్‌ను పంపిణీ చేసింది. అంబాజీపేట యూనియన్ బ్యాంకు ద్వారా రూ.9.81 లక్షలు విలువైన డ్రోన్‌ను ప్రభుత్వం మంజూరు చేయగా దీనిలో 80 శాతం అంటే రూ.7.84 లక్షలు రాయితీ కాగా, రైతు వాటా రూ.4.91 లక్షలుగాను బ్యాంకు రుణం రూ.4.90 లక్షలు. అయితే రైతులు చెల్లించిన మొత్తంలో రాయితీ సొమ్ము పోను మిగిలిన మొత్తం మరలా రైతుల ఖాతాల్లో జమఅవుతుందని కంపెనీ సీఈఓ అడ్డాల గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎం.శ్రీరామమూర్తి, డ్రోన్‌ను కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులుకు అందజేశారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఏడీఏ ఇన్‌చార్జి సీహెచ్ డి.విజయకుమార్, ఏఓ కె.ధర్మప్రసాద్, ఏఈఓ దొమ్మేటి దుర్గారావు, కంపెనీ డైరెక్టర్లు ముత్యాల జమ్మీలు, యాళ్ల వెంకటానందం, ఆకాశం శ్రీనివాస్ పాల్గొన్నారు.

డయేరియాతో డేంజర్



అంబాజీపేటలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది

అంబాజీపేట: వర్షాలు మొదలైనందున డయేరియా వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డయేరియా మసోత్సవాల కార్యక్రమాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారులు నిర్వహిస్తారన్నారు. అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓఆర్ఎస్, మందులు వంటివి అందుబాటులో ఉంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు, పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ముక్కామలలో వైద్యాధికారి కె.సుమప్రియ ఆధ్వర్యంలో డయేరియా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు బి.అప్పారావు, రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

30 మంది యువకుల రక్తదానం



వద్దిపర్రులో రక్తదానం చేస్తున్న యువకులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి పల్లేటి రాజబాబు పుట్టినరోజు సందర్భంగా ఆ గ్రామ యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఐఏఎస్ అధికారి పల్లేటి రాజబాబు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయనపై అభిమానంతో గ్రామానికి చెందిన యువత ముందుకు వచ్చి పల్లేటి ట్రస్ట్ పేరిట సేవా సంస్థను నెలకొల్పారు. ఆయన జన్మదినం సందర్భంగా మంగళవారం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల కోసం ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 30 మంది యువకులు రక్తాన్ని ఇచ్చారు. కాకినాడకు చెందిన రెడ్ క్రాస్ సొసైటీ వారి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. ముందుగా ఐఏఎస్ అధికారి రాజబాబు పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వేణుగోపాల్

మామిడికుదురు: గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఎల్‌డీఓ జె.వేణుగోపాల్, తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ సూచించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో వరదను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పలు శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని బలోపేతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇసుక బస్తాలను సిద్ధం చేయాలని సూచించారు. వరద బాధితుల కోసం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలు, ముంపు బాధితుల కోసం బోట్లు ఏర్పాటు, తాగు నీటి సరఫరా, వరద ప్రభావిత గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లపై నివేదిక అందించాలన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డీటీ శరణ్య, ఏఓ కె.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడి సంపదతో ఆర్థిక పురోభివృద్ధి



పాడి రైతులకు దాణా పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పాడి సంపదను సంరక్షించుకుంటూ ఆర్థిక పురోభివృద్ధి చెందాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పశువుల ఆస్పత్రి వద్ద పశువైద్యాధికారి శ్రీనివాస్ అధ్యక్షతన పశువుల దాణాను ఎంపీపీ మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాడి పరిశ్రమలను రైతులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత కాలంలో పశువుల పెంపకం అంతంత మాత్రంగానే ఉందని వాటి పాడి సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మైలా ఆనందరావు, గోసంగి సత్యనారాయణ, నాగాబత్తుల సుబ్బారావు, చింతా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా 'కాసు'

రాజోలు: ఉత్తమ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయనను రాజోలు రోటరీ ప్రతినిధులు, ఆర్య వైశ్య సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. గత నెల 30న రాజమహేంద్రవరం చెరుకూరి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ రోటరీ క్లబ్ అధ్యక్ష అవార్డులను ప్రదానం చేశారు. రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. 2016లో రాజోలు రోటరీ క్లబ్‌కు ఉత్తమ అవార్డు వచ్చిందని తొమ్మిదేళ్ల తర్వాత ఉత్తమ అవార్డు రావడం చాలా సంతోషకరంగా ఉందని కాసు శ్రీనివాస్ తెలిపారు. రోటరీ కార్యదర్శి కోదాటి సోమరాజు, రొటేరియన్లు దార్ల పెదబాబు, నార్కెడమిల్లి బాలకృష్ణ, నామన షణ్ముఖ్, గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.